నిలవనీరం

"వెళ్లొస్తానమ్మా!" అన్నాడు శ్రీరాములు ట్రంకుపెట్టె పట్టుకుని. సీతారామమ్మగారికి కాస్త కంటతడి పెట్టుకోవటం శుభమని తోచింది.

"ఇన్నాళ్ళు పెంచి, ఇన్ని ముచ్చట్లు చేసుకుని, చివరకు—" పైన ఆవిడకు మాట రాలేదు.

"వెళ్లొస్తా నాన్నా!" అన్నాడు శ్రీరాములు తండ్రివంక తిరిగి.

"పదినిమిషాలకిందే బయలుదేరమన్నాను. వెళ్ళదలుచుకున్న తరవాత రైలువాళ్ళ కట్టుదిట్టాలను గౌరవించకపోతే ఏం లాభం?"

శ్రీరాములు మళ్ళీ తల్లిదగ్గిర శలవు పుచ్చుకున్నాడు. ఆవిడ కళ్లొత్తుకుంటూ "ఇట్లా రాసిపెట్టి ఉంటే ఆ మూడుపోచలూ ఎట్లా పడతై? ఎన్ని లగ్గాలు పెట్టుకున్నా ఏదో అవాంతరం! పద్దెనిమిదేళ్ళ వాడేమిటి, ఇంకా వడుగైనా కాకపోవటమేమిటని అంతా ఆశ్చర్యపడేవాళ్ళే! ఇంతకూ కనటం పెంచటం నా వంతు—"

"సరేలే, ఆ ముక్క ఎన్నిసార్లంటావు? ఈ ఆడవాళ్ళు, రామరామ—" అని శ్రీరాములు అన్నగా రడ్డంవచ్చాడు తల్లికి. తమ్ముడు దత్తుపోవటం తనకేమాత్రమూ యిష్టంలేదని సూచించటానికా కుర్రవాడు ఆ రోజల్లా మొహం మటమటలాడిస్తూనే ఉన్నాడు.

"ఇహ పదవోయ్, ఆలస్యం చెయ్యక!" అన్నాడు తండ్రి. శ్రీరాములు బయలుదేరాడు. తండ్రి కొడుకు ననుసరించాడు. వాకిట్లో శ్రీరాములు వదినెగారు ఎదురొచ్చింది. ఆ పిల్ల కిటువంటి విషయాల్లో పట్టుదల జాస్తి.

శ్రీరాములు రైలెక్కి కూర్చున్నాడు. తండ్రి బయట నుంచుని కిటికీలోనించి అతనితో మాట్లాడుతున్నాడు. రైలు కదలటానికి ఇంకా అయిదారు నిమిషాల వ్యవధి ఉంది.

"అబ్బాయి, ఒక్క విషయం తెలుసుకో? మీ అమ్మ నిన్ను వెంకటప్పయ్యగారి వంశం నిలబెట్టటానికీ పంపుతున్నది. కాని నేను నీ వంశం నిలబెట్టటానికి పంపుతున్నాను. నాకు దత్తతలో ఎన్నడూ నమ్మకంలేదు. నువ్వు కొద్దిపాటి మంత్రాలతో వెంకటప్పయ్యగారి కొడుకువైపోవు. చిన్నపిల్లలు చేసే బొమ్మలపెళ్ళికీ. ఈ దత్తతకూ ఏమీ తేడాలేదు. కాని యిందువల్ల దారిద్ర్యనరకం తప్పుతుంది. నీకు భగవంతుడు తెలివితేటలు ప్రసాదించాడు. కాని డబ్బు లేకపోతే నువ్వెందుకూ పనికిరావు. ఈ విధంగా డబ్బు సంపాదించటం లంజరికంతో సమానమని నేను నిరూపించ

గలను. ఈ వేసవికాలం రెండు మూడునెల్లూ వారు నిన్ను పరీక్షించదలుచుకున్నారు-నువ్వు వారిలో అతుకుతావో అతకవో చూతామని. నువ్వంతరాత్మను యావత్తూ చంపుకుని లంజటక్కులన్నీ వినియోగించి వారి మెప్పు సంపాదించు. వెళ్ళిన క్షణం నించీ అందర్నీ వరసలుపెట్టి పిలు. ఒకరోజు కొంచెం పస్తాయిస్తివా, తరవాత నీ తరం కాదు.

"ఇటువంటి పని నీచేత ఎందుకు చేయిస్తున్నానా అని నీకు సందేహం కలుగుతుందేమో! విను, ప్రస్తుత సాంఘిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితుల్లో నీతిగా డబ్బు సంపాదించట మసంభవం—ముఖ్యంగా నీ వంటి పుట్టుదరిద్రుడికి. ఈ పరిస్థితులు ఒక రోజులో మారేవికావు. ఒకడివల్ల అయ్యే పని కాదు. కాదు కూడదు, నాకు నీతే ప్రధానమంటావా! మాడి చావడానికి సిద్ధపడు.

"నాకు చెడ్డపేరు రానేవచ్చింది, ఆస్తంతా చెడగొట్టానని. ఎందుచేత? నేను నీతిగా సంఘసేవచేసే జీవించుదామని కంకణం కట్టుకోవటంచేత! నే నింతకూ సంఘసేవ చేశాను. నాకు సంఘం పట్టెడన్నం పెట్టలేదు. నా మనస్సు విరిగిపోయింది. నాకు సంఘసేవలో నమ్మకం పోలేదు. తద్వారా జీవించటంలో నమ్మకం పోయింది. నే నొక్క మహాపాతకం కూడా చేశాను లోకం దృష్టిలో! అదేమిటంటే పశువల్లే జీవించక మనిషల్లే జీవించాను. కట్టుకునేటందుకు మంచి గుడ్డ, ఇంట్లో మంచి దీపం, తినేటందుకు మంచి ఆహారం మొదలైనవి అత్యవసరమైన వాటిల్లో చేరిపోయి నై. ఇవికాక ఇంకా యితర ఖర్చుకూడా చేశాను. అవన్నీ నా తత్వానికి అవసరమని ఇతర్లు ఊహించలేకపోయినారు.

డబ్బుయొక్క విలువ ఖర్చు చెయ్యటంలో వుంది. ఖజానాలోనుంచి బయటికి రాని డబ్బు, చేతులు మారని డబ్బు మట్టితో సమానం. అది నీకు వద్దు. రోగాలు మొదలైన యిక్కట్లకు మాత్రం అట్టే పెట్టుకుని మిగిలిన డబ్బు ఖర్చు చేసెయ్యి. నీ అవసరాలు వృద్ధిచేసుకో. ఎంత మంచి యింట్లో వుండగలవో అంత మంచిఇల్లు సంపాదించు - నీ డబ్బునుపట్టి. మూర్ఖులు విరివిగా డబ్బు ఖర్చు చేసే భాగ్యవంతుణ్ణి చూసి కన్ను కుట్టి ఈర్ష్య పడతారు. డబ్బు ఖర్చు పెట్టే ధనికుడు లోకోపకారి. డబ్బు పేరబెట్టే కుచేలుడు సంఘద్రోహి. ఒక్కటిమాత్రం మర్చిపోకు. నీ మనస్సునూ శరీరాన్నీ ఆరోగ్యంగా అట్టేపెట్టని ఖర్చు ఒక్కదమ్మిడీ చెయ్యకు. పాపా లన్నిటికీ మూలవిరాట్టు దారిద్ర్యం. దాన్ని తలతన్నిన మహాపాతకం డబ్బు ఎట్లా వాడుకోవాలో తెలియకపోవటం. నీకీ విషయాలన్నీ కాలేజీలో చెప్పారనుకుంటాను!"

"చెప్పలేదు. నేను వాటిని గురించి ఆలోచించనూలేదు. కాని ఆలోచించినట్టే అర్థమౌతున్నది నువ్వు చెప్పే దంతా!"

"మంచిది. ఈ సమస్యలను గురించి మళ్ళా ఆలోచిస్తూ కూర్చోకు. వీటి కోసం రెండు జీవితాలు వ్యర్థం కావటం నా కిష్టంలేదు. తెలిసిందా? ముందు వెంకటప్పయ్యగారి ఆ ఆస్తికి హక్కుదారుడవై, తరువాత ఆలోచించు. నా మతంలో ఏదైనా లోపమే వుంటే తరువాత సర్దుకోటం తప్పుగాదు. నేను లంజటక్కు అని చెప్పిన మాట మరిచిపొయ్యేవు సుమా, జాగ్రత్త. దాని కింకో పేరులేదు. గత్యంతర మంత కన్నా లేదు!....వస్తా!"

శ్రీరాములు తండ్రి అకస్మాత్తుగా నిష్క్రమించాడు.

శ్రీరాము లంతవరకు ఆ పెట్టెలో యెక్కిన యితర ప్రయాణీకులను గురించి ఆలోచించలేదు. అతని శరీరం ఒక్కసారి జల్లుమన్నది. తండ్రి తనతో రహస్యంగానే మాట్లాడాడు గాని అతని చెవిలో ఆయనమాట లింకా ప్రతిధ్వనిస్తుండటంచేత అతనికి బిగ్గిరగా అరిచి మాట్లాడినట్టుంది. ఎవరైనా తమ సంభాషణ విన్నారేమో ననీ, విన్న చిహ్నా లెవరి మొహానైనా ఉన్నవేమో ననీ, అత నందరి మొహాలు పరికించి చూశాడు.

అతని పక్కనే కూర్చున్న ముసలిమనిషికి బహుశా చెముడే అయివుంటుంది. ఆవిడవల్ల ఇబ్బందిలేదు. ఆవిడ పక్కన ముడుచుకుని పడుకున్న తలగుడ్డమనిషి జాగ్రదావస్థలో లేడు. ఇంకా కొంచెం దూరంలో కూర్చున్న సాయబుగారూ బాబుగారూ నైజాం దేశస్థులు. చివర కూర్చుని ఏదో డ్రామా నాటకపుస్తకం బిగ్గిరిగా పఠిస్తున్న కోమటి కిందటి శతాబ్దంనించీ ఆ పనిలోనే నిమగ్నుడై ఉన్నట్టున్నాడు. పోతే....

ఈ సమయానికి సరిగా శ్రీరాములు దృష్టి ఆ పిల్ల మీద పడ్డది. వెంటనే అతను దృష్టి అక్కణ్ణించి తిప్పేశాడు కాని వెనకటి ఆలోచన శాశ్వతంగా అంతరించిపోయింది.

అతనికి కొత్తగా అంకురిస్తున్న యౌవనం. అతని మనసులోకి స్త్రీకి అప్పుడప్పుడే స్థానం ఏర్పడుతున్నది. ఆడదాని సౌందర్యంచేత ఆకర్షించబడటం, స్త్రీని గురించి మధుర భావాలు కలగటం జరుగుతున్నది. ఆడదానిచే ఆకర్షించబడటంలో అతని ప్రయత్నం దాదాపు ఏమీలేదు. ఆ భావాలు "ఇంతింతై వటు డింతయై" అన్నట్టు ప్రజ్వలించటాని కనుభవం సహాయంలేదు. అందుచేత ఆ భావాలు గడ్డుకాయలుగానే ఉంటుండేవి.

శ్రీరాములుకు స్త్రీ సౌందర్యాన్ని గురించి తెలియదు. అంగ సౌష్ఠవం మొదలైనవి గమనించటంకూడా అతని కళ్ళు నేర్చుకోలే దింకా. కాని, మొహం అందంగా ఉందా లేదా? కళ్ళల్లో స్నేహభావం ఉందా? విరోధ భావం ఉందా? అనే విషయాలు బాగా గమనించగల స్థితిలో ఉన్నాడు. ఈ పిల్లను చూడగానే అతని మనసున ఒక విధమైన ఆనందం, తృప్తీ, స్నేహభావమూ కలిగినై. అతని ఆలోచన అక్కడికి

వచ్చి ఆగిపోయింది. ఆమీదట ఆపిల్ల తన స్నేహితురాలైతే తమ స్నేహం ఎట్లా ఉంటుందీ, ఇద్దరూ ఎట్లా మాట్లాడుకొంటా రనే విషయాలమీద తనకున్న ఒక రిద్దరు స్నేహితుల అనుభవంమీదా భావాన్ని పోనిచ్చాడు.

రైలు బెజవాడ స్టేషనులో ఆగగానే శ్రీరాములు తన ఆలోచన లన్నీ కట్టిపెట్టి ట్రంకు తీసుకుని బండిదిగి చకచకా స్టేషను బయిటికి నడిచాడు. బ్రిడ్జిమీదనే ఒక బండివాడు అతన్ని పట్టేశాడు. బండివాడికి వెంకటప్పయ్యగా రిల్లు తెలుసును. శ్రీరాములు బండి దిగి బండివాడి చేతులో బాడుగ డబ్బులు పెడుతూండగా మరో బండి వచ్చి ఆ యింటిముందే ఆగింది. దాన్లోనించి ఆ పిల్లా ఇంకో వితంతూ దిగారు!

కథ నిజమైంది! కలలు సత్యమైనై! ఇది కలల్లోనూ కథల్లోనూ జరిగే సంగతి కాకపోతే మరేమిటి?

ఆ వితంతువు నలభై ఏళ్ళది. కొంచెం మగరాయుడు. శ్రీరాముల్ని 'మీదే వూర'ని అడిగింది. అతను బాపట్లన్నాడు.

"ఓహో నిన్నేనా మా అన్నయ్య....". "అవు" నన్నాడు శ్రీరాములు, ఆవిడ అన్నగారెవరో తెలుసుకోకుండగానే. ఆ పిల్ల అతనివంకా వితంతువు వంకా చాలాసార్లు చూసింది. ముగ్గురూ కలిసి లోపలి కెళ్ళారు.

ఆవిణ్ణి అత్తయ్యా అని పిలవాలా?

తప్పుతుందా? గురుజనాజ్ఞ!

* * * *

శ్రీరాములు తండ్రి చెప్పిన ప్రకారం నడుచుకున్నాడు. వెంకటప్పయ్యగార్ని నాన్నా అనీ, వెంకాయమ్మగారి నమ్మా అనీ, కృష్ణవేణమ్మగారి నత్తయ్యా అనీ పిలిచాడు. హైమవతిని ఏమనీ పిలవాలిసిన అవసరం లేకపోయింది. చెల్లెలివరస. కొన్ని కొన్ని పనులు మొదట కష్టంగా ఉండి అలవాటుమీద సుకర మౌతై. ఈ వరసలు పెట్టి పిలవటాలు మొదట కష్టంగాఉండి పోనుపోను కష్టతర మౌతై శ్రీరాములు వంటివాడికి. నోటివెంట అమ్మా అనికాని, నాన్నా అనికాని అనవలసినప్పుడల్లా అంతరాత్మ హోరాహోరీ తనతో యుద్ధం చెయ్యటం అట్లా ఉండగా వాళ్ళు తన కలుపుకోలుతనంచూసి ఉత్త వెధవని భావించుకుంటారేమోనని అనుమానం. కాని త్వరలోనే వెంకటప్పయ్యగారూ, వెంకాయమ్మగారూ అపరిమితంగా సంతోషిస్తు న్నారని తేలిపోయింది. ఆ విధంగానే కృష్ణవేణమ్మ తన్ను వాజమ్మకింద కట్టినట్టు కూడా కాస్త యించుమించుగా తేలిపోయింది. ఆవిణ్ణిచూస్తే అతనికి చాలా మండుకు పోయింది. కొన్నిసార్లు అత్తయ్యా అని ఇప్పు డతనేంచెయ్యాలి? ఒక్క-ఉదారి కనపడ్డది. సగం ఎగతాళిగా అత్తగారూ అని పిలవటం మొదలు పెట్టాడు. దాంతో అతని మనసు కాస్త శాంతించింది. ఆవిడకీ అత్తగారు సంబోధన అస లిష్టంలేదని

తెలిసిన తరువాత శ్రీరాములు పూర్తిగా తృప్తిపడి అత్తగారనే సంబోధన ఖాయ పరిచాడు.

క్రమేణా అతనికి వెంకటప్పయ్యగారి కుటుంబం తాలూకూ బీరకాయ పీచు అర్థం కావటం మొదలు పెట్టింది.

వెంకటప్పయ్యగారు చదువుకున్నవాడు కాదు ఆయనకు తండ్రి పదెకరాల భూవసతీ వెయ్యిరూపాయల రొక్కం యిచ్చిపోయినాడు. దాన్ని వెంకటప్పయ్య గారి పినతండ్రి ముప్ఫైవేల రూపాయల ఆస్తి చేసి పోయినాడు.

వెంకటప్పయ్యగారికి ముగ్గురాడపిల్లలు సంతానం. పెద్దపిల్ల రత్నం - రత్తమ్మ-సంపన్నుల యిల్లు మెట్టింది. ఆవిడ మొగుడు కంట్రాక్టరు. పెద్ద ఉద్యో గస్థుణ్ణనుకునేవాడు. రత్తమ్మకూడా అట్లాగే అనుకునేది. రెండో పిల్ల మాణిక్యాన్ని కూడా భాగ్యవంతులకే యిచ్చారు కాని ఆ పిల్ల మొగుడు కొద్దిరోజులకే పోవడం, అత్తవారు మాణిక్యమ్మకు సాలకు పుట్టి మనోవర్తి యివ్వటం తటస్థించింది. మొదటినుంచీ మాణిక్యం గడుసుపిల్ల. శాస్త్రోక్తంగా వైధవ్యం అనుభవించటం ఇష్టంలేక ఆ పిల్ల ఎవరితోనో లేచిపోయి వెంకటప్పయ్యగారి పాలసముద్రం వంటి వంశానికి కళంకం తెచ్చింది. ఆ పిల్లను గురించి ప్రసంగం తేవటం ఎవరికీ, ముఖ్యంగా కృష్ణవేణమ్మత్తగారికి, ఎంతమాత్రమూ ఇష్టంలేదని శ్రీరాములు గ్రహించాడు.

హైమవతి కడసారిపిల్ల. ఆ పిల్లకు పెళ్ళయిన కొద్దిరోజులకే ఆమె భర్తకు క్షయరోగం ఉందని తెలిసింది. అత నిప్పుడు సంవత్సరంనించీ చాలా బాధపడు తున్నాడు. ఇది ఇట్లా ఉండగా పిల్లను కాపరానికి పంపమని వెంకటప్పయ్యగార్ని వియ్యాలవారు తొందర చేస్తున్నారు! శ్రీరాములుతో కలిసి వచ్చేటప్పుడు హైమవతి అత్తింటినించే వస్తున్నది.

కృష్ణవేణమ్మ కూడా చిన్నతనంలో భర్తపోతే ఆవిడ మర్యాదగా అత్త వారింట్లోనే ఉండాలని ప్రయత్నంచేసి కొద్దికాలానికే తన మామగారి ప్రవర్తనను గురించి అనుకోటానికి కూడా వీలులేని అనుమానాలు తగిలి అన్నగారి దగ్గిరికి వచ్చే సింది, వెంకటప్పయ్యగారికి పెద్దెత్తుగా ఉండాలని.

సంవత్సరానికి పదిహేను వందలకూ లేక నెలకు నూరు రూపాయలకూ తక్కువరాబడి గలవాళ్ళతో ఎటువంటి సంబంధం పెట్టుకోదలచలేదు. ఆయన ఎవ రెవరితో సంబంధం పెట్టుకోదలచుకున్నాడో వాళ్ళంతా విద్యావంతులై ఉండటంచేత వాళ్ళంతా ఆయన ఎదటనే ఆయన్ని చూసి నవ్వటం, వాళ్ళెందుకు నవ్వుతున్నారో తెలీక, తెలీదని తెలియచెయ్యటం ఇష్టంలేక ఈయన వాళ్ళకన్న ఎక్కువగా నవ్వటం మొదలైన అవాచ్యాలు జరుగుతూండేవి. ఇరుగుపొరుగువాళ్లు చెప్పుకునే కథలన్నీ నమ్మవలిసిన కారణం కనిపించదు కాని వెంకటప్పయ్య వాకిళ్లకు తెరలూ గోడల

మీద రంగులూ వేసిన కుండబొమ్మెలూ మొదలైన అలంకారాదులు ఎవరినో చూసి చేసినవని స్పష్టంగా తెలుస్తూనే వుంది. ముగ్గురాడపిల్లల పెళ్ళిళ్ళూ చాలా జయప్రదంగా చేశాడని అందరూ ఏకగ్రీవంగా ఒప్పుకున్నారంటే ఎంత డబ్బు ఖర్చుచేసి ఉంటాడో, అంతులేని డబ్బు వ్యయంచేసి ఆడపిల్ల పెళ్ళి చేసి అనరానిమాటలు పడ్డ అనుభవశాలులకేగాని తెలీదు.

శ్రీరాములుకు ఈ జీవితం చాలా బాగుంది. అతన్ని గురించి ఇంట్లో ఉన్న వాళ్ళకు మంచి అభిప్రాయమే ఏర్పడ్డది. అతనికి అందులో ఎవరిని గురించీ ఘనమైన అభిప్రాయం ఏర్పడలేదు. కాని పైకి అందరి కష్టసుఖాలూ గమనించి ప్రవర్తించేవాడు.

అతను హైమవతిని వరసబెట్టి పిలవాలిసొస్తే చాలా ఇబ్బందే కలిగేది. ఆ పిల్ల తన కాబోయే చెల్లెలని తెలిసిన క్షణంనించీ ఆ పిల్ల ఆలోచనకు పచ్చిపుండయి పోయింది. సాధ్యమైనంతవరకు ఆమెను చూడటం కాని ఆమెతో మాట్లాడటంకాని మానేశాడు. కాని ఆమె పెళ్ళిని గురించి వినగానే అతని మనస్సులో కొంత ఆందోళన ప్రారంభమైంది. తన దృష్టిపథంలోకి రాకుండా ఉంచిన ఈ పచ్చిపుండును మధ్య మధ్య రహస్యంగా పరిశోధించటం మొదలుపెట్టాడు. ఆ పిల్లను గురించి ఆలోచించటం అతనికి తప్పనిసరయింది.

శ్రీరాములుకు పుట్టింటిదగ్గర— అంతకన్న సరైనపదం ఏముంది?— జీవితం నిస్సందేహంగా మురికిగుంటే. ఇక్కడి కొచ్చిన కొత్తల్లో ఈ జీవితం ఒక పెద్ద చెరువుగా కనపడ్డది. సంతోషించాడు. కాని లోతుకు దిగి ఆలోచిస్తే దానికీ దీనికీ భేదం ఆటే కనిపించలేదు. ఇక్కడి నమ్మకాలూ, పద్ధతులూ, ధనవ్యయం - మొత్తంమీద జీవిత మక్కడికన్న పెద్దెత్తుగా ఉన్నా, నిజం ఆలోచిస్తే రెండుచోట్లా నిలవనీరే. ఈ నిలవనీటికి చలనం కలగటం ఎట్లా? దీన్ని ఏవిధంగా ప్రవాహం చెయ్యటం? తన తండ్రి కేవలం అట్లా చెప్పకపోయినా, ఆయన అన్న మాటల్లో యిటువంటి అభిప్రాయం ఒకటి లేకపోలేదు. ఈ రహస్యం హైమవతిని గురించి ఆలోచించటం మొదలుపెట్టిన వెంటనే బయటపడ్డది. ఈ నిలువ నీటిలో ఈ రెండుతెప్పలూ ఒకదానొ్నకటి సమీపించటం అసంభవం. ప్రవాహమైతే?

అయితే ఏమిటో అతనికీ తోచలేదు. సంఘం తనకూ హైమవతికీ మధ్య కనపడని గోడ కట్టింది. ఆమె నతను పరస్త్రీగా భావించుకుని లోకంయొక్క అసమ్మతిని ఓర్చయినా ప్రేమించటం మొదలుపెట్టలేడు. దాని కామె చెల్లెలవుతుంది. సొంత చెల్లెలిని చూసినట్టు చూసి ఆమె మంచి చెడ్డల్లో తను భాగం పొందలేడు. దాని కామె పరస్త్రీ ఔతుంది. ఈ నూతన బాంధవ్యం ఈ విధంగా ఎవ రనుభవంలోనైనా వస్తుందా? దత్తుపోయిన వాళ్ళకు తప్ప? ఇప్పు డతనికి ఆడవాళ్ళ జీవితంలో కష్టం తెలిసొచ్చింది. ప్రతి ఆడదానికీ ఈ బాధ తప్పదుగద! తన తండ్రి చెప్పిన "భోగం

టక్కులు" సుఖంగా కొత్త మొహాలతో కాపరం చెయ్యదలిచిన ప్రతి ఆడదీ చెయ్య వలసిందే. తరతరాలనించీ చేస్తూ ఉండటంచేత వాళ్ళ కవి ఈపాటికి అలవాటయి ఉండవచ్చును. అంతమాత్రానికి అవి బోగంటక్కులు కాకుండా పోతవా? ఎవరో పరాయి మొహాలను వరసపెట్టి పిలవాలి. లోపల లేని గౌరవం చూపించాలి. తనకు సంబంధించని విషయాల్లో శ్రద్ధ తీసుకోవాలి. తనకన్న చిన్నవాళ్ళను కూడా ఏమయ్యా, ఏమమ్మా అనాలి కాని ఏమిరా, ఏమే అనరాదు. తనకన్న పాతికేళ్ళు చిన్నవాళ్ళయినా తప్పదు. ఇంతకన్న వేరే నిర్బంధం ఏంకావాలి? మొగుడూ అత్తగారూ మొదలైన వాళ్ళు చేసే నిర్బంధం దీంతో పోలిస్తే ఎంత? ఇది మనిషికి దాస్యం. అది ఆకార మైనా లేని ఆచార పిశాచానికి దాస్యం!

ఏకారణంచేతో హైమవతికూడా తన్ను తప్పించుకు తిరుగుతున్నట్టు కనపడ్డది. ఆ సంగతి తెలుసుకున్నప్పుడు శ్రీరాములుకు చాలా కష్టంవేసింది — ఆ కారణంగా. మొదట తన్ను అనుమానంతో చూసిన కృష్ణవేణమ్మ క్రమంగా అభిప్రాయం మార్చుకోవటం అతనికి మరింత చిరాకు కలిగించింది. ఈ పాడులోకంలో తృప్తనే మాట మనిషికి లేనేలే దనుకున్నాడు. జీవితం యావత్తూ లోపాలమయం. సృష్టి కూడా అంతే. భగవంతుడూ అంతే!

* * *

హైమవతి భర్త పోయినాడు. శ్రీరాములు ఆశ్చర్యపడలేదు. అటువంటి దేదో జరక్కపోవటమే విపరీతం. కృష్ణవేణమ్మ కేశఖండనాన్ని గురించి ప్రస్తావన తీసుకు రాగానే అతని గుండె బద్దలయింది. కాని మరెవరూ అందు కొప్పుకోలేదు. పరిసి పోయింది.

చెల్లెల్ని ఆదరించి పోవటానికి రత్తమ్మ వచ్చింది. జ్ఞాపకం పెట్టుకుని శ్రీరాము లావిణ్ణి వచ్చిన మరుక్షణంనుంచీ అక్కా అని పిలవటం మొదలుపెట్టాడు. ఆవిడకు ఎంతమాత్రం ఈ పద్ధతి రుచించినట్టు కనపడలేదు. మొత్తంమీద ఆవిడ అతిశయాహం కారా లతనికి చాలా తలనొప్పి కలిగించినై.

ఆవిడ వచ్చిన మర్నాడే చెల్లెలి నూతన వైధవ్యాన్ని గురించి మరిచిపోయినట్టు కనిపించింది. ఎంచేతంటే ఆవిడకు ఉన్న నాలుగు రోజులూ తండ్రిని సాధించటం తోనే సరిపోయింది.

"మహా పెట్టావులే! చేశావులే! హయ్యోరామ! పక్షపాతా లుంటే దిగమింగుకుని లోపలే పెట్టుకోవాలి కాని ఒకర్ని ఒకవిధంగా ఇంకోర్ని ఇంకోవిధంగాచూస్తే అది మాత్రం ఏం బాగుంటుంది? ఎవరైనా వింటే నవ్వుతారు. మా ఊళ్ళో అంతా నవ్వే వాళ్ళే. నాకు వచ్చినట్టుందమ్మా, చెప్పొద్దూ! 'తల్లిదండ్రులు బాగానే వుండిరిగదా, కూతుర్నీ అల్లుణ్ణీ—' అంటారా? అనరా?"

"ఔనౌను!" అన్నాడు శ్రీరాములు నిట్టూర్పు విడిచి. రత్తమ్మ భయంకరంగా అతని వంకచూసి మళ్ళీ చాటభారతం ఎత్తుకుంది.

"ఔనులే! ఆ మాణిక్యాం బతికుండీ చచ్చినదాంతోనే సమానం కదా? నేను సరేసరి కదా? ఇక మీకు గారాబపు అమ్మాయి అదేగా? ముద్దులల్లుడుదాని మొగుడేగా?"

"మొన్న శ్రీరామనవమికే కాదుటే తీసుకురాంది నిన్ను? అతనేమో చావు బతుకులమీద ఉండెను. చూడబోయినా మనేగా నీ సాధింపు? అది మాత్రం నీవంటిది కాదూ? దానికేమీ తెలీనప్పుడు నీకు పెట్టలేదా చెయ్యలేదా? ఇప్పుడా చచ్చినతన్ని సాధిస్తావేమిటి?"

"అబ్బో! మహా పెట్టావులే! చేశావులే!"

శ్రీరాములుకు తలనెప్పి జాస్తయింది. అతనక్కణ్ణించి లేచి మేడమీదికి పోయినాడు. అక్కడ ఒంటరిగా కుర్చీలో కూర్చుని హైమవతి కళ్ళనీళ్ళు పెట్టుకుంటున్నది. అతని అడుగుల చప్పుడు విని ఆ పిల్ల తల ఎత్తి చూసింది. శ్రీరాములు తిరిగి కిందికి వెళ్ళిపోదామా అని ఆలోచిస్తూ ఒక్క క్షణం నిలబడి వద్దని తీర్మానించుకుని ఒక కుర్చీ ఆమె దగ్గిరిగా ఈడ్చుకుని కూర్చున్నాడు.

నిలవనీరు పారటం మొదలుపెట్టింది!

మనిషి జీవితానికి చలనం కలిగించే యంత్రాలు మనిషి బుర్రలోనే ఉన్నవని శ్రీరాములు తరవాత గ్రహించాడు.

హైమవతి కళ్ళు తుడుచుకుని అతనివంక నిదానించి చూసింది. అతనది గమనించలేదు. అతనికల్లా సంభాషణ ఎట్లా ప్రారంభించాలా అని. చివరకాపని హైమవతే చేసేసింది.

"ఏదో పనిమీద వచ్చినట్టున్నారు. పని చేసుకుపొండి. నేను ఒంటరిగా కూర్చో దలచుకున్నాను."

శ్రీరాములుకు తాత్కాలికంగా ఆగ్రహం వచ్చింది. ఆ బహువచనం!

"నేను కాస్సేపు మీ దగ్గిర కూర్చుని మంచిచెడ్డలు మాట్లాడ దలచుకున్నాను——"

హైమవతి లేచింది.

"ఈ విధంగా కపట ప్రవర్తన చెయ్యటం దుర్భరంగా వుంది. నేనెన్నడూ నెలరోజులపాటు ఇంత దొంగవేషం మీద వుండలేదు. ఒక్కసారి తమతో అసలు శ్రీరాములల్లే మాట్లాడదామని వచ్చాను."

హైమవతి కాస్సేపు నిర్ఘాంతపోయి చివరకు మెల్లిగా కుర్చీలో కూర్చుంది. ఈ మాటతో ఆ పిల్ల మనస్సులోవున్న పెద్దసంశయం ఒకటి నివారణ అయింది. శ్రీరాములు వరసలుపెట్టి పిలవటం, ఆ పుతడల్లే ప్రవర్తించటం మొదలైనదంతా దొంగెత్తేనని హైమవతి మొదటనే కనుక్కుంది. అతని చర్య ఆమెకు చాలా అసహ్యమనికూడా అనిపించింది. ఒకవేళ అది దొంగెత్తు కాకపోతే శ్రీరాములంత దద్దమ్మ పుట్టబోడు, పెరగబోడన్నమాట. శ్రీరాములు కపటంగా ప్రవర్తించటమే కాక అట్లా ప్రవర్తిస్తు

న్నట్టు ఒకరి దగ్గిరయినా ఒప్పుకోటానికి సిద్ధంగా ఉన్నాడన్న మాట. సాహసే! బహుశా తనప్రవర్తనకు కారణం చెబుతాడేమో! వినదగినదే! కాని హైమవతి కోరిక నెరవేరలేదు. ఆమె కూర్చోగానే శ్రీరాములు విషయం మార్చాడు.

"మీ అక్కయ్యకు చిన్నతనంలో తలమీద బలమైన గాయం తగిలి ఉండాలి, అంచేతే మతిపోయింది."

ఇప్పుడు హైమవతి కోపం చికాకూ వచ్చి పడ్డది. ఒకసారి మీరు అని అతన్ని పిలిచి ఇప్పుడు నువ్వని మార్చటానికి తగిన కారణం ఏముంది? ఇంకా మీరు మీరంటూ మాట్లాడటంలో అర్థం లేదు. ఏ కోపంమీద అట్లా సంబోధించిందో ఆ కోపం అతను తన ప్రవర్తనకు కారణం చెప్పకుండానే పోగొట్టాడు, చాలావరకు. గట్టివాడే! ఏమైతేనేం, ప్రస్తుతం ఆమె మాట్లాడితే వినేస్థితిలో ఉందికాని- మాట్లాడే స్థితిలో లేదు. "ఆవిడ మాట్లాడుతుంటే నాకు మోకాట్లో మెడనరం పట్టుతుంది!" అన్నా డతను, ఇంకా రత్తమ్మను గురించే.

"ఆవిడకు అహంకారం జాస్తిగా కనపడుతుంది!" అన్నాడు కొంచెంసేపుండి.

"వాళ్ళు చాలా భాగ్యవంతులు!" అంది హైమవతి.

"ఆఁ! వాళ్ళెటువంటి ఇళ్ళలో ఉంటారేం? ఎటువంటి తిండి తింటారేం?"

"తింటారనా?" అన్నది హైమవతి.

"తినరని నాకు తెలుసును. తింటారని కాదు, తినాలని! డబ్బుండి ఎందుకు? బీదవాడికీ భాగ్యవంతుడికీ ఏమిటీ భేదం-ఆరోగ్యకరమైన ఆహారం. ఇళ్ళూ, దుస్తులూ లేకపోయిన తరవాత, నాకు? నాకు సామాన్యమైన జీవితం ఆనలేదు. ప్రస్తుతం భోజనం కింద పరిగణింపబడే చెత్తా, ఇళ్ళకింద పరిగణింపబడే నక్కగుంటలూ నాకు చాల్లేదు. ఈ గొడ్డుబతుకు మానేసి మనిషల్లే బతకట మత్యావశ్యకమైంది. అందుకు డబ్బు తప్ప సాధనోపాయం లేదు. దానికోసం వచ్చాను. అందుకోసం వచ్చినవాణ్ణి మరొకందుకు వచ్చినట్టెందుకు ప్రవర్తించటం? ఏ షరతులమీద నాకు మీ నాన్నగారి డబ్బు లభిస్తుందో ఆ షరతులకు లోబడి నా గర్వాన్నీ అహంకారాన్నీ చంపుకుని ఒక విధంగా నడుచుకుంటున్నాను. అనేక కారణాలవల్ల అందరం వెధవపనులు చెయ్యాలి సొస్తుంది. అంత మాత్రానికే అందరం వెధవలమని అనుకోవటం గాని మనం చేసే పనులు నిజంగా వెధవ్వి కావనుకోవడం గాని నాకు అవసరంగా కనిపించలేదు. నిన్ను చూసిన క్షణంనించీ నీకూ నాకూ మధ్య రహస్యాలు అవసరం లేదనుకున్నాను. అందుచేత నీ కిదంతా చెప్పేస్తున్నాను. నేను చేసే మంచి పనుల కెప్పుడూ మెప్పవసరం లేదు. నేను చేసే పాడుపనులేవైనా వున్నప్పుడు నీ వంటిదాని సానుభూతి కావాలి. నువ్వర్థం చేసుకుంటే నా మనసుకు చాలా తృప్తిగా ఉంటుంది. నేను చేసిన పని నీకు సమ్మతమేనా?"

హైమవతి కాస్సేపు ఆలోచించి "నాకేమీ అభ్యంతరం చెప్పటానికి కనిపించటంలేదు!" అన్నది.

"మా అన్నయ్య ఎంత దురదృష్టవంతుడు. మా వదినెగారు వేదాంతి, ఆచార సంపన్నురాలు, నీతిమతి. ఆవిడ ప్రతిరోజూ తీరుబాటు చేసుకుని మొగుడి దుష్ప్రవర్తన యావత్తూ ఏకరుపెట్టి ఖండిస్తూ ఉంటుంది. మా వాడు కేవలం దుర్మార్గుడు కాకపోయినప్పటికీ ఆవిడ ఆయన్ను చాలా బాగుచేసిం దని ప్రతీతి. నా కావిడంటే చాలా భయం....నీ వంటివాళ్ళకు మొగుళ్ళు పోతారు! మాయప్రపంచం!"

హైమవతి అటువంటివాణ్ణి యెన్నడూ చూడలేదు. అతను మాట్లాడుతూంటే తనకు మతి పోయినట్టనిపించింది. అయిదు నిమిషాలు విడవకుండా యెన్నడూ ఆలోచించి ఎరగని తన్నతను యెక్కడికో మబ్బుల మీద తీసుకుపోతునట్టయింది. మెల్లిగా ఆలోచన చిక్కబట్టి సమాధానం ప్రారంభించింది. "మీరు-"

"'నువ్వు' చాలు. నన్నసలెవ్వరూ గౌరవంగా పిలవరు. పైగా నేను నీ కంటే రెండుమూడేళ్ళే పెద్ద."

"ఇంత విపులంగా అరిటిపండు ఒల్చిపెట్టినట్టు చెబితేనేగా, నా కర్థమయింది. నేను మాత్రం పొరపాటు పళ్ళేదా?"

హైమవతి నువ్వూ మీరూ కూడా లేకుండా చేసింది.

"పోనీ ఇప్పటికైనా అందుకున్నావు!"

హైమవతి లేచి పిట్టగోడమీదిగా చూసింది. బండి ఒకటి యింటిముందాగినట్టు శ్రీరాములు కూడా తెలుసుకున్నాడు.

"మా మాణిక్యం!" అంది హైమవతి ఆశ్చర్యంతో. ఆమె గొంతులో కొంత సంతోషం లేకపోలేదు.

"నాకు అప్పా? చెల్లెలా?" అన్నాడు శ్రీరాములు.

"చెల్లెలేమో ననుకుంటా! నా కన్న రెండేళ్లు పెద్ద."

"బేష్! 'చెలెలా రారమ్మ, చెల్లెలా రమ్మ. ఎది చూచెద'—ఈవిడే కాదూ వంశానికి కళంకం తెచ్చింది?"

"ఆఁ! కళంకంకాదు గడ్డలు! దానంత మంచిదిలేదు."

"దటీజ్ ఒరిజినాలిటీ!"

మాణిక్యమ్మ యింట్లో అడుగు పెట్టగానే అందరూ గొల్లుమన్నారు-దుఃఖం కాదు ఆగ్రహం.

"ఏడిచారులే! హైమీ యేదీ? పైనుందా? మళ్ళీ వచ్చి మాట్లాడతాను. ఇప్పుడే గొంతులు చించుకోకండి!" అంటూ ఆమె మెట్లెక్కి పైకి వచ్చింది. శ్రీరాములు తీరిగ్గా లేచి యింకోకుర్చీ తెచ్చి దగ్గిర వేశాడు.

శ్రీరాములును చూచి మాణిక్యం వాకిట్లోనే ఆగి ఎవరు వీ రన్నట్టు చూసింది హైమవతి వంక. ఆమెను చూస్తూనే అతను మనసులో మని షట్లా ఉండాలనుకున్నాడు. మాణిక్యం నఖశిఖ పర్యంతం ఆరోగ్యంతో వెలిగిపోతున్నది. మనిషి అమిత పరిశుభ్రంగానూ, కట్టూ బొట్టూ వగైరాల యందు చాలా శ్రద్ధగలదిగానూ చూడగానే కనిపిస్తున్నది.

"నేను ప్రస్తుతం ఇక్కడ ట్రయల్ మీద ఉన్నాను. ఈ రెండు మూడు నెల్లూ చూసి పనికొచ్చేటట్టయితే నన్ను మీ అన్నగా పరిగ్రహిస్తారు మీ నాన్నగారు. ఎందుకో నాకు తెలీదు. నా అభ్యంతరం ఎంతమాత్రం లేదు" అన్నాడు శ్రీరాములు.

"నా కర్థంకాలేదు !" అంది మాణిక్యం.

"నాన్న పెంచుకుంటున్నాడు !" అన్నది హైమ.

"నాన్నా ! ఈయన్నా !" అంది మాణిక్యం ఆశ్చర్యంతో.

"అందుకేమైనా బలమైన అభ్యంతరం ఉందా !" అన్నాడు శ్రీరాములు.

"తప్పకుండా ఉంది. మా నాన్న కేముంది పెంచుకోటానికి ? ఆయన దివాలా తీశాడు."

"ఇప్పుడు నా కర్థంకాలేదు !" శ్రీరాములుకు నిజంగా అర్థం కాలేదు.

"మా నాన్నకు బోలె డప్పుంది. ఇంకా అప్పులవాళ్ళకు తెలీ దెంతఉందో. ఎప్పుడో పిడుగు పడుతుంది. సర్వనాశనమే. ఒక్క పరక, ఒక్క పోచ మిగల్దు. నాకు తెలుసును."

శ్రీరాములు ఉత్సాహం యావత్తూ చచ్చిపోయింది.

"నిజంగానా ?"

"మా ముగ్గురి పెళ్ళిళ్ళకూ చేసిన అప్పు ఇప్పుడు యిరవై అయిదువేలయింది. ఇదిగాక యింకా పదివేలు యితరత్రా చేశాడు."

శ్రీరాములు నిట్టూర్పు విడిచాడు.

"నువ్వేంచేస్తావే హైమా ? నిన్ను ఓదార్చటానికి రాలేదు నేను. వెధవ ముండగా అక్కుపక్షల్లే బతకదలచుకున్నావా ? మళ్ళీ పెళ్ళి చేసుకుని నీ విధిని నిర్వర్తించాలా ? నీ కిక్కడ గ్రహాలు చాలా ఉన్నై. అవి నిన్ను ఆవహించి నీ చేత ఏమీ కాకుండా చేసై. నాకు తెలుసు. కాని నీ మీద యింకా పట్టి పీకులాడుతున్నది, అందరిమీదా పోయినా కూడా ! అందుకని నా బుద్ధికి తోచిన ముక్కలు రెండూ చెప్పి పోదామని వచ్చాను."

"హైమవతికీ యితరులకూ గల తేడా నేనుకూడా ఇదివరకే గమనించాను. నేను పొరపాటు పడలేదన్నమాటే !" అన్నాడు శ్రీరాములు.

"చూడు బాబూ ! నీ పేరేమిటో ?"

"నా పేరు శ్రీరాములు."

"అట్లా అయితే నువ్వు దీన్ని తీసుకుని మీ ఊరు లేచిపో."

"నాకు చెల్లిలి వరస !"

"ఇదెక్కడి చెల్లెలి వరస ? ఈ పెంపుడుకు ఒప్పుకోనే వద్దు. నా మాట నమ్మ."

"గోత్రం ?"

"ఎక్కడో గోత్ర మంటావేమిటి ? ఈ గోత్రం యెప్పటిదో ? ఈ లోపల మాలోనూ మీలోనూ నా వంటి పతివ్రత లెంతమంది ఐనారో ? 'నానాగోత్రోద్భవస్యా' కాలా వంశాలు ? అసలు మా అమ్మ విషయమే నా కనుమానంగా...."

"ఏమిటే చిన్నక్కయ్యా అది ! మరీ యెలికల యేనాది మచ్చవుతున్నా" వంది హైమవతి. మాణిక్యం బిగ్గిరిగా నవ్వింది.

"సరే నే వెళ్లొస్తా. బండివాడితో పదిహేనునిమిషా లన్నా. ఇంకా కింద కొంచెం వడ్డింపులు కావలసి ఉన్నై !" అంటూ మాణిక్యం వెనక్కు తిరిగింది.

వాకిలిదగ్గర మళ్ళీ ఆగి "నేను చెప్పిన సంగతిని గురించి యిప్పుడే మాట్లాడుకోండి ఇద్దరూ. రెండు నిమిషాలు ఎవరూ పైకి రాకుండా ఆపుదల చేస్తా !" అని మెట్లు దిగిపోయింది.

మాణిక్యం వెళ్ళిపోగానే శ్రీరాములు మనసులో నీరసం మరీ జాస్తయింది. కాస్త ప్రవహించటం మొదలుపెట్టిన జీవితం మళ్ళీ ఘనీభవించింది. నిస్పృహ మంచల్లే మనస్సుమీద పడి కప్పెయ్యటం మొదలుపెట్టింది. నిద్దరను ఆపుకోదల చినవాడు శరీరం విదిలించుకున్నట్టు శ్రీరాములు ఒక్కసారి మనస్సును విదిలించాడు.

ఇది తీరిగ్గా మాట్లాడుకోవలసిన సమయంకాదు.—యిష్టం లేకపోతే హైమవతి రెండు తిడుతుంది.... ఈ నిస్పృహకన్న తిట్లు తినటంలో ఉన్న చైతన్యం లక్షరెట్లు నయం.

అతను చప్పున లేచి హైమవతిని సమీపించి వంగి మొహంపెట్టి "మీ అక్కయ్య చెప్పిన సలహాప్రకారం చేద్దామా" అన్నాడు.

హైమవతే తన మొహం అతని మొహానికి ఆనించి వుండాలి. లేకపోతే అతని ప్రయత్నం లేకుండా ఆ రెండు మొహాలూ యెట్లా కలుసుకున్నై ?

శివుడి జడల్లోనించి అవతరించిన గంగ మోస్తరుగా ఆతనిలో జీవశక్తి ప్రవహించటం మొదలుపెట్టింది. ఆతని చెవుల్లో హోరు ఆ బాపతేనేమో కూడాను.

ముద్రణ : ?

ప్రచురణ :

నిలవనీరు కథలసంపుటిలో, యువ బుక్ డిపో : మద్రాసు,

డిసెంబరు 1945, ప్రథమ (ముద్రణ)